# ఆదివారం

—సత్యం—

దయార్ద్ర హృదయంతో అధికారులు నాబోటి శ్రామికులకు విశ్రాంతికొరకు కేటాయించిన కాళీ రోజు కాళీరోజుకదూ అందుకుబట్టను కాళీగా ఉంచడం దేనికని ఏవేవో భావాలతో నింపేస్తూ సిగరెట్ పెట్టె తీశా - పెట్టె కాళీ—దాన్ని నేలకి విసిరి కొట్టాక కాఫీ జ్ఞాపకం వచ్చింది - వేసిన పొలంకేకకి ఇల్లాలు కాఫీగ్లాసుతో తయారు.

అంతటితో ఊరుకుందా—

"కూరలు ఏవైనా తీసుకురండీ!" అంది 'డీ' ని సాగదీస్తూ ఆడాళ్ళకి అలవాటైన అదోక మోస్తరుగా.

"అవును వారానికల్లా కూరలు తెచ్చుకోవడానికి కాళీ అయినరోజు అదొక్కటే—"

కాఫీసాఫీగాతాగి ఇత్తడిగ్లాసు ఇల్లాలికందించి సంచీఅందుకున్నా.

బజారులో ఎన్నో పరిచయమైన ముఖాలు చిక్కమొహం వేసుకొని నావైపు చూశాయి- అవునుమరి! ఆ సుమిత్రులకికూడా ఆదివారం తప్పితే దర్శనం యివ్వలేక పోతున్నా— వెధవ ఉద్యోగం—

"తప్పకుండా మీల్సు తీసుకుని మీట్ అవుతానుగా!" అంటూ అందరికీ వాగ్దానంచేసి ఇంటి మలుపు తిరిగేసరికి మా మంగలి "చిత్తం" అన్నాడు.

"ఇప్పుడేమిటిరా. 11 గంటలకి అని" గడ్డం తడుపుకుంటే తక్షణం చేయించుకోకపోతే ఏర్పడే ప్రమాదాలన్నీ తలపుకివచ్చి "సరే, రా! ఇవాళ కాకపోతే మళ్లీ ఆదివారందాకా అసలు వీలుండదు" అని మంగలిని మా ముంగిట వరకూ తీసుకువచ్చి ఆ కాస్త అవశిష్టమూ తీర్చుకున్నా- పనిలోపని అయిపోవాలంటూ మాయింటామె కుంకుడుకాయలు నానేసింది. కళ్ళలోపడిన పులుసును కప్పిపుచ్చి, యమబాధ పడుతూ భోజనానికి సిద్ధపడితే "పంచదార ఇస్తున్నారుటండీ" అని ఒక హెచ్చరిక-

కాఫీగతప్రాణాల నిత్యజీవితంలో పంచదార పాత్ర అతి ముఖ్యమైందికదూ! ఏదితప్పినా అది తప్పదు—

సరే ప్రతిరోజూ 10 గం॥ చేసే భోజనం 12 దాకా డేకింది. అసలే స్వేదజనితమైన వేసవి- అందులోనూ దారుణమైన కారాన్ని గుప్పించిన భోజన పదార్థాలూ- ఆ అవస్థలోనే వీధిలో ఆఫీసు బంట్రోతు "హెడ్ గుమాస్తాగారు ఒక్కమారు నిల్చున్నపళాన్ని అయ్యగార్ని రమ్మన్నార" ని తంబితో అంటున్నాడు- ఏం కొంపమునిగిపోయిందని ఆదివారంనాడు?

ఆ ఎండలో పోయి, చచ్చినా కనపడని కాగితాలు వెదికి చచ్చీ చావని పరిస్థితిలో మూడు అయేటప్పటికి యింటికి జేరతే —

"ఎక్కడికి వెళ్ళారండీ! కిరసనాయిలు చీటీ ఇదిగో! సీసాలక్కడ పెట్టా"నంది నిజభార్య-

తంబితోసందూస్తే లాభంలేదు. వాడు ఆరయితేకాని యింటిమొఖం చూడడు- యీలోపున కిర్సనాయిలు వస్తేనేకాని యింట్లో 'ఢీడిక్కీలు' తప్పవు-

కిర్సనాయిల్ పట్టుకొని వస్తూంటేనే చాకలి కనిపించాడు- "ఏమిరా!" అంటే "మీబట్టలేనండి" అంటూ నాతోపాటు యింటిదాకా వచ్చి బట్టలప్పగించి చచ్చినట్టు చాకలిపద్దుపడేసి అరగంటసేపు నాచేత రాయించి మరీవెళ్ళాడు-

టైము అయిదయింది- ఎంతమందినో కలుసుకోవాలనుకున్నా- ఈ వారంనుంచీ కొన్ని పత్రికలన్నీ చదవాలనుకున్నా పైగా ముఖ్యమైంది సినీ

మా ప్రోగ్రాం ఒకటుంది- ఇన్నీకూడా శేషించిన కాలంలో పూర్తిచేసుకోవాలి-

తయారయి బయటకు బయలుదేరుతున్నా. ఇంతలో "అన్నయ్యా" అంటూ చెల్లాయి వచ్చింది- "ఏమమ్మా" అంటే "ఎక్కడికో వెడుతున్నట్లున్నావన్నయ్యా నాకు రెండులెక్కలుచెప్పిమరీ వెళ్ళ"మంది. అవునన్నట్టు రేపు చెల్లాయికి లెఖ్ఖల పరీక్ష. వీధిలోకి వేసినఅడుగు వెనక్కివేసి కుర్చీలోకూలబడ్డా. "లఘుగణితం" తీసుకు వచ్చింది- అయిదువందల పేజీలపుస్తకం లఘుగణితమేమిటి? ఎవడు పెట్టాడాపేరు? గురుగణితం అది-

ఏదోలెఖ్ఖఅడిగింది- అసలే లెఖ్ఖలో అంతంత మనం- అందులో అది బండలెక్క. ఇక చూచుకోండి మనపని- దానితో తంటాలు పడి అన్నదుకట్టించే టప్పటికి ఏడు దాటింది లెక్కచేయాలనే పట్టుదల అభిమానాలమధ్య నా కార్యక్రమాన్ని విస్మరించుకుని తర్వాత విచారించాను.

సరే భోజనం అయింది- నడుం వాల్చాను- నిద్రపట్టనిస్తేగా ఇంట్లో ఆడముఠా అంతా వసారాలోకిజేరి తారాబలం చంద్రబలం గురించి వాదోపవాదాలు ప్రారంభించి ఎవరి ఫలితాలు వాళ్ళు తెలుసుకొని తృప్తిపొందారు. ఈ వార ఫలాలుకూడా ఆదివారం నాడేకదా!

దయతో అధికారులు ప్రసాదించిన విశ్రాంతి దిన కార్యక్రమాన్ని సమీక్షించుకుంటూ అసంతృప్తితో కళ్ళుమూస్తుంటే ఇంటివారి అయిదేళ్ల అమ్మాయి "ఆదివారమునాడు ఆట విడుపు" అంటూ పాఠం చదువుతోంది—


## పెళ్ళిపందిరి

శోభించడానికి చిన్నసలహా

పెళ్ళివారికి విందులతోబాటు వినోదాలుకూడా కలిగించాలంటే మాకు చెప్పండి.

## భరతనాట్యాలు

ఇంపైన సంగీతం సొంపైన డ్యాన్సులు:
కథాకళి, కూచిపూడి, మొదలు ఆధునిక సినిమారకం డ్యాన్సుల వరకూ అద్వితీయంగా ప్రదర్శిస్తారు.

శ్రీమతి మణికుమారి, సుగుణ;
సత్యవతి, సూర్యనారాయణ,
వేణీకృష్ణవేణి మొదలగువారు




వివరాలకు

శ్రీ సరస్వతీ నాట్యబృందం
మంగళవారంపేట
రాజమండ్రి